

# తప్పు

–కోనేరు రాజబాబు

సాయంకాలం ఆరుగంటలైంది.

ఉదయం నుంచీ ఉధృతాన్ని చూపిన సూర్యభగవానుడు చల్లబడిపోయి ప్రపంచానికి గుడ్‌బై చెప్పి సేదతీర్చుకొనేందుకు వెళ్ళిబోతున్నాడు.

నా స్టెనో వచ్చి "సార్! రేపు మీ సొంతవూరిలో ఏదో కార్యక్రమానికి అధ్యక్షత వహించడానికి ఇంతకుముందే అంగీకరించారు – గుర్తుందా? సార్!" అన్నాడు.

"అవును గుర్తుంది – బైదిబై రేపు మీరు రానక్కర్లేదు – ఆఫీసు కారు కూడా వద్దని చెప్పండి" అన్నాను.

ఎలా మరచిపోగలను?

నాకు జన్మనిచ్చిన భూమి –

నేను ఓనమాలు దిద్దిన పుణ్యభూమి

స్నేహితులతో కలసి చెట్టాపట్టాలేసుకొని అమాయకంగా ఆడుకొన్నచోటు –

నాకు విద్యనేర్పిన గురువులున్నచోటును మరచిపోదామన్నా మరువలేను–

అందుకే! నా చిన్ననాటి మిత్రులు కొందరు వచ్చి "మన జయభారతి గ్రంథాలయం వార్షికోత్సవానికి ఈ సంవత్సరం మీరు అధ్యక్షత వహించాలి" అని అడిగిందే తడవుగా ఒప్పుకున్నాను–

నా తల్లిదండ్రులు ఆ ఊరు వదిలి 30 సంవత్సరాలు దాటిపోయింది. అక్కడితో దూరాన వున్న మాకు ఆ ఊరితో సంబంధాలు తెగిపోయాయి.

మళ్ళీ 30 సంవత్సరాల తర్వాత ఆ ఊరు వెళ్ళే అవకాశం వచ్చింది. ఇంటికి వెళ్ళిన నాకు రాత్రి సరిగా నిద్రపట్టలేదు. కళ్ళు మూసినా పాత జ్ఞాపకాలే!

ఎంతోకాలం తర్వాత నా మిత్రులను కలవబోతున్నాను –

ఇప్పుడు నన్ను గుర్తుపట్టగలరా? ఇవే ఆలోచనలు –

ఎప్పుడు నిద్ర పట్టిందో నాకే తెలియదు – తిరిగి లేచేసరికి ఉదయం ఆరు గంటలైంది–

అరగంటలో ఉదయ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకొని ఆర్.టి.సి. బస్సుస్టాండుకు చేరుకున్నాను.

ఎదురుగా మా ఊరి బస్సు నిలబడి వుంది –

ఆనందంతో వెళ్ళి బస్సులో కూర్చున్నాను.

రోజూ ఆఫీసు ఫైళ్ళతో సతమతమయ్యే నాకు ఈ రోజెంతో హాయిగా వుంది. చల్లని గాలి పులికింప చేస్తుంటే పచ్చని పైర్లు కనువిందు చేస్తున్నాయి దారి పొడవునా. 12 గంటలకల్లా మా ఊరి గడ్డపై కాలు మోపాను.

ఏదో తెలియని అనుభూతి నన్నావరించింది. చిన్న పిల్లాడిలా కేరింతలు కొట్టాలనిపించింది. బస్సు ఆగిన చోటుకు ఎదురుగానే నేను ఓనమాలు దిద్దుకొన్న స్కూలు – చేతులెత్తి ఒక్కసారి నమస్కరించాను. నేను కారులో వస్తానని ఎదురుచూస్తున్న మిత్రులు బస్సులో దిగిన నా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చారు.

పూలదండలతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. పిన్నలు, పెద్దలు కుశల ప్రశ్నలతో నన్ను ఆశ్చర్యపరిచారు. కొందరు "మీరు పత్రికలలో వ్రాసే కథలు చదువుతాం" అన్నారు.

మరికొందరు "మీరు రేడియోకి వ్రాసే నాటికలు విన్నాం" అన్నారు.

నాకు మాత్రం నోట మాట రాలేదు.

కళ్ళవెంట నీళ్ళు జలజల రాలాయి.

తల్లి ఒడిచేరిన చిన్న పిల్లాడినయ్యాను –

పాతమిత్రులైన నా వాళ్ళతో కబుర్లు చెప్పకుంటూ చూడాలనుకొన్న కొన్ని ప్రదేశాలు చూశాం.

ముప్పై సంవత్సరాలలో ఎంత మార్పు?

నేను గోలీలు ఆడుకొన్న చోట్లన్నీ ఇప్పుడు ఎత్తైన భవనాలతో నిండిపోయాయి. తాటాకు ఇళ్ళు ఇప్పుడు డాబాలుగా మారినయ్.

మా జయభారతి గ్రంథాలయ స్థాపకుడు, సంఘ సేవకుడైన మా అన్నయ్య నరసింహారావు అక్కడ నాకు అన్ని ఏర్పాట్లూ చేశాడు. భోజనాలైన తరువాత పాతమిత్రులు కొందరు ఎక్కడెక్కడున్నారో, ఏం చేస్తున్నారో తెలుసుకున్నాను. అక్కడున్నంతసేపూ నేను ఒక ఐ.ఎ.ఎస్. ఆఫీసర్నన్న సంగతే మరచిపోయాను. నిజంగా అలాంటి అనుభూతి మరపురానిది–

అందరూ జీవితంలో బయలుదేరేది ఒకచోట నుంచే – కానీ గమ్యాలు వేరు.

కొందరు ఉద్యోగస్తులైతే – మరి కొందరు వ్యాపారవేత్తలు – కొందరు దేశానికి వెన్నెముకైన రైతాంగం.

ఫంక్షను సాయంకాలం కాబట్టి మా అన్నయ్యను అడిగాను 'మన ఉపాధ్యాయులెవరైనా వుంటే చూడాలని వుందని" అన్నయ్య సరేనన్నాడు.

కొంతమంది ఉపాధ్యాయులను చూసేసరికి నాకు వేయిగుళ్ళలో దేవుళ్ళను చూసినట్లు అనిపించింది.

చివరిగా ఒక ఇంటికి దారితీశాడు అన్నయ్య.

శిథిలమైపోయిన ఇల్లు – పాత జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ "ఇది ఆచారి మాస్టారు గారి ఇల్లు కదూ?" అన్నాను. 'ఔ'నన్నాడు అన్నయ్య.

ఆచారి మాస్టారు గారంటే ఆ రోజుల్లో క్రమశిక్షణకు మరో పేరు – ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులెవరూ ఆయన్ని జీవితంలో మరచిపోలేరు.

మంచం మీద పండుకొని వున్నారు.

ఇ ఇంటిలాగానే ఆయన కూడా జీర్ణించిపోయి వున్నారు – మమ్మల్ని చూడగానే ఆయన ఎక్కడలేని శక్తి కూడాగట్టుకొని లేచి కూర్చున్నారు.

బోసి నోటితో నవ్వుతూ "రాజా! నన్ను చూడాలని వచ్చావా? నేనింకా నీకు గుర్తున్నానా బాబూ?" అంటూ నా భుజం తట్టారు. ఆయన స్పర్శతో నాలో ఏదో శక్తి ప్రవహించింది. నోట మాట


## అదృష్టపు రాయి (భాగ్యరత్న)

**ధర: రూ.20/– మాత్రమే**

**ఫలితము లేనిచో...డబ్బు వాపస్**

ప్రతిభావంతులైన జ్యోతిష్కుల భవిష్యత్‌వాణి, గ్రహాలు, నక్షత్రాలు మానవుని విధిని శాసిస్తాయనే సూత్రం మీద ఆధారపడినవి. జ్యోతిష్యం మీద కొన్ని వేల అనుమానాలు వ్యక్తం చేసిన పాశ్చాత్య హేతువాదులు కూడా మన అదృష్టం మీద గ్రహాల ప్రభావాన్ని అంగీకరించాల్సి వచ్చింది.

ప్రత్యేకమైన అధ్యయనాలవల్ల రకరకాల మణులు, వివిధ జన్మరాశులపైన నిశ్చితమైన ప్రభావాన్ని చూపుతాయని తెలిసిందే. రాశుల ప్రకారం 'సరిగ్గా ఎన్నుకున్న మణుల నుండి ప్రయోజనకరమైన తరంగాలు వెలువడి ధరించినవారికి మేలు కలుగజేస్తాయి. మేము ప్రాచీన సూత్రాలనాధారం చేసుకుని అదృష్టపు రాళ్లనిస్తాము. ఇది నిరయన (చంద్ర) పద్ధతిపైన ఆధారపడినది. దీని విలువ రూ.20/–లు మాత్రమే. మీరు ధరించిన వెంటనే రాయి ప్రభావం పెరిగి మీకు సర్వతోముఖ విజయాన్ని చేకూర్చుతుంది.

ఇది ఒక అసాధారణమైన పూచీ. ఒకవేళ రాయి మీరనుకున్నట్లుగా మీ భవిష్యత్తును ప్రభావితం చేయడంలో విఫలమైతే 30 రోజుల తరువాత బిల్లుతోసహా వి.పి.పి. ద్వారా వెనుకకు పంపవచ్చును. మేము గ్యారంటీగా అంగీకరించి రూ.20/–లు పూర్తిగా తిరిగి చెల్లిస్తాము. మీరు రూ.20/–లు ఎం.ఓ. ద్వారా పంపినట్లైతే మీకు రూ.12/–లు వి.పి.పి. ఛార్జీలు ఆదా అవుతాయి.

<u>ఉపయోగించు విధానం:</u> మీరు అదృష్ట రాయిని అందుకున్న తరువాత సోమ, గురువారాలలో స్నానం చేసి రాయిని పాలు, నీరుతో కడిగి 'రాయి' ముందు ఒక అగరువత్తిని వెలిగించండి. ఆ తరువాత ధరించండి. సరియైన రాయినే అందుకున్నారని తెలిసాక ఉంగరంలో గాని, లాకెట్‌లో గాని బిగించి ఎల్లప్పుడూ ధరించండి. రాయిని రోజూ పూజించాల్సిన పనిలేదు. ఆడవారు ఋతుకాలంలో కూడా ధరించవచ్చు. మీరు ఇతర మణులను, ఆభరణాలను కూడా ధరించవచ్చు. మీకు మేలు జరిగితే మాకు వ్రాయండి. శుభాకాంక్షలతో...

<u>గమనిక:</u> ఈ రాయి సహజమైనది. దీనిలో మంత్రం కాని తంత్రం కాని లేదు.

ప్రధాన కార్యాలయం:

**రామరత్న ఆస్ట్రోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్**

27, నీల్‌తరంగ్ ఫ్లాట్స్, నిజాంపురా, బరోడా–390 002.

రాలేదు. 30 సంవత్సరాల నాటి విద్యార్థిని. ఆయన నన్ను పేరుపెట్టి పిలిస్తే ఆశ్చర్యపోయాను. అప్రయత్నంగా నా చేతులు ఆయన కాళ్ళ వద్దకు వెళ్ళినయ్. రెండు కన్నీటి బిందువులు ఆయన పాదాలపై పడ్డాయ్. ఆయన నన్ను లేవదీస్తూ "రాజా! కష్టపడి పనిచేసిన రైతు చేను పంటతో ఫలితానికొస్తే సంబరపడిపోతాడు. అలాగే తన దగ్గర చదువుకున్న ఒక్క విద్యార్థి అయినా పైకివస్తే అతని జన్మ తరించినట్లే – నువ్వు ఐ.ఎ.ఎస్. పాసయ్యావని మనవాళ్ళు చెప్పినరోజు నిజంగా నేను పొందిన ఆనందం నీకు చెప్పలేనయ్యా– జీవితంలో అదొక అనుభూతి" అన్నారు.

ఈలోగా మాస్టారుగారి భార్య రెండు గ్లాసులతో మజ్జిగ తెచ్చి అన్నయ్యకు నాకు ఇచ్చింది. కుశల ప్రశ్నలతో అరగంట గడిచిపోయింది.

మాస్టారుగారు తన పెట్టెలో నుంచి ఒక కవరు తెచ్చి నాకిస్తూ "రాజా! నేను పేదవాడినిరా – చదువును ఎప్పుడూ బోధించానే కాని అమ్ముకోలేదు – ఇంతకాలానికి నన్ను చూడాలని వచ్చావు – నీకు ఏమి కానుకగా ఇవ్వగలను? ఇదిగో ఈ కవరు తీరుబడిగా చూసుకో" అన్నారు.

ఆయన ప్రేమతో ఇచ్చినదాన్ని కాదనలేకపోయాను.

"మాస్టారూ! మీకు ఎలాంటి అవసరం వచ్చినా నేనున్నానని మాత్రం మరచిపోకండి" అంటూ మరొకసారి పాదాభివందనం చేశాను. కంట తడితో మమ్మల్ని మాస్టారు సాగనంపారు.

సాయంకాలం ఫంక్షన్ ఘనంగా జరిగింది.

నాతో పరిచయమున్నవారు, నా గురించి విన్నవారు, నన్ను చూడాలనుకొన్నవారు, మన ఊరివాడన్న అభిమానం కలవారు ఫంక్షనుకు వేల సంఖ్యలో వచ్చారు.

సభానంతరం వినోద కార్యక్రమాలు జరిగాయి.

తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

తల్లిదండ్రుల నుంచి అత్తింటికి వెళ్ళే ఆడపడుచులా అయింది నా పని.

ఆఖరి బస్సులో ఎక్కాను–

మిత్రులంతా వీడ్కోలు చెప్పారు.

## ఆదుర్దాతో కూడిన తాపీ! మిశ్రమం

మాయాబజార్ సినిమాకి మొదటి సగం తాపీధర్మారావుగారు, రెండో సగం డైలాగులు ఆరుద్రగారు రాశారు. ఆ చిత్రాన్ని సమీక్షిస్తూ ముళ్ళపూడి వెంకట రమణగారు "మొదటి సగం తాపీగానూ, రెండో సగం ఆదుర్దాగానూ నడిచింది" అని రాశారు. — బద్దిగం



ఆ జనంలో ఎక్కడో వెనుక చేతికర్రతో చేయి ఊపుతూ ఆచారి మాస్టారు గారు కూడా కనిపించారు.

అందరికీ వందనం చేస్తుండగా బస్సు ముందుకు సాగింది.

ఆ రోజు ఆదివారం–

ఆచారి మాస్టారు గారిచ్చిన కవరు గుర్తుకువచ్చింది.

ఎటాచ్ కేసులో భద్రంగా దాచిన కవరు తీసి చదవటానికి ఆత్రుతగా చించాను –

ఆది నేను ఎనిమిదవ, తరగతి చదివేటప్పుడు వ్రాసిన ఉత్తరం –

పూజ్యులు ఆచారి మాస్టారు గార్కి!

నమస్కారములు – ఈ రోజు

మీరు తరగతికి వచ్చినప్పుడు లేచి నిలబడలేదని నన్ను మూడుదెబ్బలు వేశారు – నేను మిమ్మల్ని చూడలేదన్నా మీరు నా మాట నమ్మలేదు.

ఏదో లెక్క చేసుకుంటూ నేను నిజంగా మిమ్మల్ని చూడలేదు. ఇది ముమ్మాటికీ నిజం మాస్టారు – తప్పు తెలిసి చేసినా తెలియక చేసినా తప్పే – నన్ను క్షమించమని వేడుకొంటూ

మీ విద్యార్థి
రాజా

ఆ రోజు జరిగిన సంఘటనకు నేను వ్రాసిన ఉత్తరాన్ని మాస్టారుగారు ఇన్ని సంవత్సరాలు దాచారా? ఆశ్చర్యమేసింది – దానికి మరొక రెండు కాగితాలు పిన్‌చేసి వున్నాయి –

అవి మాస్టారుగారి డైరీలో పేజీలు – మొదటి పేజీలో "నా 39 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఈ రోజు పెద్ద తప్పు చేశాను – క్రమశిక్షణ పాటించలేదన్న నెపంతో బుద్ధిపూర్వకంగా తప్పుచేయని ఒక తెలివిగల విద్యార్థిని చావబాదాను – ఇది నేను చేసిన నేరం – తప్పుచేసినప్పుడు దండించకపోవడం ఎంత నేరమో, తప్పు చేయనప్పుడు దండించడం కూడా అంతే నేరం.

తప్పు చేసినవాడు శిక్షార్హుడు. కాని నాకు ఎవరూ శిక్ష విధించరు. అందుకే ఆ విద్యార్థిని కొట్టిన చేతిని నేనే ఈ తలుపు సందులో బంధించి నన్ను నేనే శిక్షించుకుంటున్నాను" అని వ్రాసి వుంది.

డైరీలో పేజీ చదివేసరికి నా చేతులు వణికినయ్ – మాస్టారుగారు ఆ తరువాత చేతి కట్టుతో రావడం, తనకు ఏదో దెబ్బ తగిలిందని చెప్పడం నాకింకా గుర్తుంది –

తరువాతి పేజీలో –

"ఈ రోజెంతో దుర్దినం – వరకట్న వేధింపులకు నా ఒక్కగానొక్క కూతురు సమిధ అయిపోయింది. తనను నిత్యం వేధించే నరరూప రాక్షసుల నుంచి తప్పించుకొని సుదూర ప్రాంతాలకు వెళ్ళిపోయింది. నేను దాన్ని మట్టి చెయ్యడానికి నా దగ్గర డబ్బులుంటాయో లేదో అని ఆ కష్టం కూడానాకు ఇవ్వడానికి ఇష్టపడక తానే వొంటికి నిప్పంటించుకొని బూడిదైపోయింది.

ఎంత దారుణం?

మాస్టారుగారు ఒక్క మాటంటే డబ్బు ఇచ్చేవారు ఎంతోమందున్నారు – ఆయన మాటకు అంత విలువ వుంది –

కానీ ఆయన అభిమానంతో ఎవ్వరినీ అడగలేదు.

బహుశా మాస్టారుగారి కన్నీరను కుంటూ ఆఖరి మాటలపైబడి అక్షరాలు కాస్త చెరిగినయ్–

అదే పేజీలో క్రింద "నా విద్యార్థి రాజా ఐ.ఎ.ఎస్. పాసయ్యాడని ఇప్పుడే తెలిసింది – నా కూతురి మరణాన్ని కూడా మరచిపోయాను. నా విద్యార్థి పైకి రావడంకన్నా నేను కోరుకునేదేముంటుంది. జీవితంలో ఒక్కసారైనా 'రాజా'ని చూడగలనా? అని వ్రాశారు కళ్ళు ఆర్ద్రమైనాయి –

మాస్టారుగారి మూగప్రేమను భరించలేకపోయాను.

నా ఆలోచనలను భంగపరుస్తూ నా ఏకైక పుత్రుడు 'డాడీ' అంటూ లోనికి వచ్చాడు – వాడు పదవ తరగతి చదువుతున్నాడు. ఒక్కడే పుత్రుడు కాబట్టి నా శ్రీమతికి నాకు కూడా అమితమైన ప్రేమ.

వాడిని ఒక్క మాట కూడా అనం. వాడు చెప్పిందే వేదం –

"ఏమిటి చిన్నా!" అన్నాను.

"మా స్కూలులో స్ట్రయిక్ చేస్తున్నాం" అన్నాడు.

"ఎందుకు చిన్నా?" అని అడిగాను.

వాడు జవాబు చెప్పేలోగా ఫోను మోగింది.

"హలో రాజా స్పీకింగ్" అన్నాను.

"నమస్కారమండీ! నేను మీ అబ్బాయి చదువుకొనే శారదా పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్‌నండీ – మీ అబ్బాయి క్లాసులో సిగరెట్ త్రాగుతుంటే చూసి సహించలేక ఒక దెబ్బ వేశాను. దానికి కుర్రవాళ్ళను పోగుచేసి స్ట్రయిక్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు – ఇందులో నా తప్పుంటే ...."

"నో – మీ తప్పులేదు. యు.ఆర్. రైట్. ఆ విషయం నేను చూస్తాను – యూ డోంట్ వర్రీ" అన్నాను.

"డాడీ! మీరు కూడా స్కూలుకు వచ్చి వాళ్ళ మీద యాక్షన్ తీసుకోవాలి" అన్నాడు నా పుత్రుడు.

చెంప ఛెళ్ళుమంది.

ఆశ్చర్యంతో 'డాడీ' అన్నాడు.

మళ్ళీ చెంప ఛెళ్ళుమంది.

వాడికర్థమైపోయింది.

ఈ కొత్త అనుభవానికి వాడు మౌనంగా బయటకు నడిచాడు.

ఆచారి మాస్టారుగారి డైరీలో పేజీ గుర్తుకువచ్చింది. "తప్పు చేసినప్పుడు దండించక పోవడం ఎంత నేరమో తప్పు చేయనప్పుడు దండించడం అంతే నేరము"

అందుకే తప్పు ఎవరు చేసినా వేలెత్తి చూపాలి.

తప్పు ఎంతటివారు చేసినా శిక్షించాలి – అప్పుడే ధర్మం నాలుగు పాదాల నడుస్తుంది.